క్లుప్తంగా

వైభవంగా మహంకాళమ్మ ఉత్సవాలు



మహంకాళమ్మకు పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని విఠలాపూర్‌లో మహంకాళమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. గ్రామ మహిళలు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన గజ్వేల్ ట్రాఫిక్ సీఐ



పూల మొక్క అందజేస్తున్న గజ్వేల్ ట్రాఫిక్ సీఐ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మురళి మంగళవారం సీపీ కార్యాలయంలో సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ గురించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సీపీ సూచించారు.

సింగరాయ జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ కిరణ్

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి–కూరెళ్ల గ్రామాల మధ్యగల శ్రీప్రతాప సింగరాయ లక్ష్మీ నరసింహా స్వామి జాతర ఈనెల 9వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో జాతర ఏర్పాట్లు హుస్నాబాద్ సీఐ కిరణ్ పరిశీలించారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్ల ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలు, స్నాన ఘట్టాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ తిరుపతి ఉన్నారు.

గొర్రెల పంపిణీ చేపట్టాలి



వినతి పత్రం చూపుతున్న కురుమ సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ప్రారంభించి లబ్ధిదారులకు లబ్ధి చేకుర్చాలని సిద్దిపేట రూరల్ మండల కురుమ సంఘం ఉపాధ్యక్షుడు రాంబాబు అన్నారు. ఒక్కో లబ్ధిదారుడు రూ.43,750 చొప్పున ప్రభుత్వానికి చెల్లించామని, గొర్రెల పంపిణీ చేయాలని మంగళవారం జిల్లా పశుసంవర్థక శాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



ప్యాడ్‌లు, స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంఈఓ ప్రభుదాస్

దుబ్బాక: విద్యార్థులు శ్రద్ధగా చదివి పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని దుబ్బాక మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ అన్నారు. మంగళవారం ట్రెస్మా ఆధ్వర్యంలో దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, స్టడీ మెటీరియల్‌ను సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అరవింద్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ట్రెస్మా మండల అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడిగా..

మద్దూరు(హుస్నాబాద్): యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడిగా దూళ్మిట్ట మండలం జాలపల్లి గ్రామానికి చెందిన చెట్కూరి కమలాకర్ నియమితులయ్యారని జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివరాజ్‌యాదవ్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు జనగామలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో సహాయపడిన జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి, మద్దూరు జెడ్పీటీసీ కొండల్‌రెడ్డికి కమలాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

బోధన.. సాధన

- టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- అల్పాహారానికి దాతల ప్రోత్సాహం కరువు
- ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని వినతి

పదో తరగతి వార్షిక పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టారు. పాఠశాల పనివేళలకు ముందు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రతీ ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సబ్జెక్ట్‌ల వారీగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. గణితం, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌ల్లో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మాఊరు–మాబడి నినాదంతో గతంలో పది విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణకు అందించిన ప్రోత్సాహం ప్రస్తుతం ప్రజాప్రతినిధుల నుంచి, గ్రామస్తుల నుంచి కరువైంది.



కోహెడ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కోహెడ(హుస్నాబాద్): మండలంలో 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 241 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో 75 మంది, కేజీబీవీలో 38 మంది, టీఎస్ మోడల్ స్కూల్‌లో 91 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో బాలికలు 176 మంది, 269 మంది బాలురు ఉన్నారు. మండల వ్యాప్తంగా 15 పాఠశాలలలో మొత్తం 445 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

ప్రోత్సాహం కరువు

ఎస్సెస్సీ ప్రత్యేక తరగతుల కోసం గతంలో కలెక్టర్ నుంచి ప్రతీ విద్యార్థికి అయ్యే ఖర్చు భరించేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. విద్యార్థులకు అల్పాహారం సమకూర్చడంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల నుంచి ప్రోత్సాహం కరువైంది.

నగదు, కానుకలతో ప్రోత్సాహం

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పలువురు దాతలు నగదు, కానుకలు అందిస్తామని ప్రకటించారు. గతంలో పాఠశాల టాపర్లకు అప్పటి రాష్ట్ర ఆరోగ్య, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు నగదు రూ.10 వేలు మండల టాపర్లకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈసారి కూడా కుల సంఘాలు, ఎన్‌జీవోలు, ప్రజాప్రతినిధులు బహుమతులు అందించి విద్యార్థులను ప్రోత్సహించాలని పలువురు గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

ఇష్టంగా చదువుతున్న



ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఇష్టంగా చదువుతున్నా. ప్రతీ సబ్జెక్టులో అధిక మార్కులు వచ్చేలా ప్రిపేర్ అవుతున్నా. ప్రత్యేక క్లాసుల్లో అల్పాహారం అందిస్తే బాగుంటుంది. దాతలు ముందుకు వచ్చి ప్రోత్సాహం అందించాలి. చక్కగా చదివి మంచి మార్కులతో పాసై పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తెస్తా.

– శ్వేత, 10 తరగతి విద్యార్థి, హైస్కూల్ కోహెడ

ప్రత్యేక తరగతులతో ..



ప్రత్యేక తరగతుల్లో పరీక్షలకు సిద్ధం అవుతున్నా. సందేహం వస్తే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నా. తరగతి గదిలో పాధ్యాయులు చెప్పిన పాఠాలను మళ్లీ నివృత్తి చేసుకుంటున్నా. ముఖ్యంగా లెక్కలు, ఇంగ్లిష్ సబ్జెక్టుల పై క్లాస్‌మేట్స్ అందరం మంచి పట్టు సాధిస్తున్నాం.

– రిశ్వాంత్, 10వ తరగతి విద్యార్థి, హైస్కూల్ కోహెడ.

ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్ట్‌లపై ప్రత్యేక బోధన



మా పాఠశాలలో టెన్త్‌లో 61 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్ట్‌ల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నం. సిలబస్‌పై అవగాహన కల్పిస్తున్నం. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సబ్జెక్ట్‌ల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నం. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం.

– మహమూద్, హెచ్‌ఎం హైస్కూల్ కోహెడ

ఉజ్వల యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి



గ్యాస్ సిలెండర్లను పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం నిరుపేద కుటుంబాలకు వరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి అన్నారు. అక్కన్నపేట మండలం నందారంలోని వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీలో మంగళవారం 26 మంది లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల చివరినాటికి 1600 మంది లబ్ధిదారులకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ చేతుల మీదుగా గ్యాస్ సిలెండర్ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గొల్లపల్లి వీరాచారి, గ్యాస్ ఏజెన్సీ డీలర్ పచ్చిమట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ మంగళవారం తెలిపారు. పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేసిన జడ్జి శ్రావణి ఐదుగురికి రూ.5,300 జరిమానా, ఒకరికి ఒకరోజు జైలుశిక్ష విధించారు.

బీఆర్ఎస్ నేతలపై ఫైర్

గజ్వేల్‌రూరల్: బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ మంగళవారం అన్నారు. బాల్కాసుమన్ వ్యాఖ్యలు వారి అహంకారానికి నిదర్శనమన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

- కోహెడ ఫ్యాక్స్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి
- తహసీల్దార్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కోహెడ(హుస్నాబాద్): కోహెడలోని ప్రభుత్వ భూమిని కోహెడ ఫ్యాక్స్ చైర్మన్ పెర్యాల దేవేందర్ రావు కబ్జా చేశారని, విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ సురేఖకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని సర్వే నంబర్ 1306ఏలోని 5.20 ఎకరాలు, 1307ఏలోని 4.27 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వ భూమిలోని గుట్టను బ్లాస్టింగ్ చేయడంతో సాయిబాబా, పెద్దమ్మ ఆలయాలు పాక్షికంగా దెబ్బతింటున్నట్లు పలువురు గ్రామస్తులు అధికారులకు మొరపెట్టుకున్నా లాభం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఎడ్ల రాంచంద్రం పాల్గొన్నారు.

పరిసరాలపై అవగాహన తప్పనిసరి

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: రేపటి ఆరోగ్య సమాజ నిర్మాణ కర్తలుగా విద్యార్థులు పరిసరాలపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. మంగళవారం స్వచ్ఛ బడిలో తెలంగాణ రాష్ట్ర నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో లైఫ్‌స్టైల్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకంతో కలిగే ఇబ్బందులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్లాస్టిక్ రహిత సిద్దిపేట లక్ష్యంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషిచేస్తున్నారన్నారు.

వరి పొలాల సందర్శన

గజ్వేల్: గజ్వేల్ మండలం దాచారం, బయ్యారం, క్యాసారం గ్రామాల్లో వరి పొలాలను గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం యాసంగి వరి సాగులో కొన్ని చోట్ల నాటు వేసే దశ, మరికొన్ని చోట్ల పిలక వేసే దశలో ఉండగా మొగి పురుగు, సల్ఫైడ్ ధాతువుతో వరి నష్టానికి గురవుతున్నట్లు గుర్తించారు. నివారణ చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు.

కాంగ్రెస్ నాయకుల భగ్గు



బాల్క సుమన్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కాంగ్రెస్ నాయకులు భగ్గుమన్నారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.

కోహెడ(హుస్నాబాద్): కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మంద ధర్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: సీఎం రేవంత్ రెడ్డిపై బాల్కసుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్క సుమన్ దిష్టి బొమ్మను ఉరి తీస్తూ నిరసన తెలిపారు. బాల్క సుమన్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీ పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చందు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకులు బాల్క సుమన్‌పైన మంగళవారం బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దుబ్బాక: సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని దుబ్బాక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంగరి రవి, మున్సిపల్ అధ్యక్షుడు ఏసురెడ్డి హెచ్చరించారు. బాల్క సుమన్ సీఎంపై చేసిన వ్యాఖ్యలకు మంగళవారం దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ములుగు(గజ్వేల్): సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. మంగళవారం మండల కేంద్రమైన ములుగులో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కొండపాక(గజ్వేల్): ఓటమిని జీర్ణించుకోలేక బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని కుకునూరుపల్లి, కొండపాక మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విరుపాక్ష శ్రీనివాస్‌రెడ్డి, వాసరి లింగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్



డ్రైవర్లను సన్మానిస్తున్న అధికారులు

గజ్వేల్‌రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టొచ్చని ఎంవీఐ కవిత, ఆర్టీసీ మెదక్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం అన్నారు. మంగళవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ ఆర్టీసీ డిపోలో ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చిన ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్ల బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జీపీపీ డిపో మేనేజర్ సురేఖ, ఎస్‌టీఐ కనకలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు అడ్డగింత

సిద్దిపేటఅర్బన్: బస్సులు ఆపకపోవడంతో విసిగిపోయిన ఓ యువకుడు బస్సును అడ్డగించి ఆందోళన చేసిన ఘటన సోమవారం జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుబ్బాక మండలం పద్మనాభునిపల్లికి చెందిన మహిళ తన కుమారుడు గణేశ్‌తో కలిసి సిద్దిపేట రూరల్ మండలం చిన్న గుండవెల్లి గ్రామానికి వచ్చింది. సోమవారం తిరిగి ఇంటికి బయలు దేరారు. బస్సులో వెళ్లేందుకు వీరు బంధువు బైక్‌పై బూరుగుపల్లి స్టేజీకి చేరుకున్నారు. సిద్దిపేట నుంచి మెదక్, దుబ్బాక వెళ్లే బస్సులు వచ్చినా స్టేజీ వద్ద ఆపలేదు. బస్సును ఆపాలని చేయి ఎత్తినా ఆపకపోవడంతో మహిళ కుమారుడు బంధువు బైక్‌పై గణేశ్ వెంబడించి బస్సును అడ్డగించాడు. బస్సులు ఎందుకు ఆపడం లేదంటూ ఆందోళనకు దిగాడు. ప్రయాణికులతో కిక్కిరిసి పోయిందని అందుకే బస్సును ఆపలేదని డ్రైవర్ స్వామి యువకుడికి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకొని యువకుడికి నచ్చజెప్పడంతో శాంతించాడు.

సమ్మెను జయప్రదం చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి మద్దెల అంజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నట్లు కార్మికుల తరఫున ఎంపీడీఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ దాడులు



ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామ శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఇందులో మూడు ట్రాక్టర్‌లను సీజ్ చేసి మద్దూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడారు. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన, నిల్వ చేసిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నటు వారి సమాచారాన్ని సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667447, 8712667446 కు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నంగునూరు(సిద్దిపేట): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం తెల్లవారు జామున పట్టుకొని రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహిస్తున్నామన్నారు. పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన, అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలించినా, మత్తు పదార్థాలు విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కలెక్టర్‌కు వినతి**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం గ్రామంలోగల 321 సర్వే నంబర్‌లో ఉన్న 13.26 గుంటల భూమిని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరుతూ ఆ గ్రామ మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వివరాలు తెలుసుకున్న కలెక్టర్ హుస్నాబాద్ ఆర్డీఓకు ఎండార్స్ చేసినట్లు లక్ష్మారెడ్డి తెలిపారు.

◆ **కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు**

దుబ్బాకటౌన్: కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తన హోదా మరచి మాట్లాడడం సిగ్గుచేటని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి అన్నారు.మంగళవారం ఆయన దుబ్బాకలో విలేకర్లతో మాట్లాడారు. ఓటుకు నోటు కేసు ఎదుర్కొంటున్న రేవంత్ రెడ్డి తన ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణను సాధించిన కేసీఆర్‌పై నోటికొచ్చినట్లు మాట్లాడడం మంచిది కాదన్నారు. కేసీఆర్‌పై అసత్య ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

◆ **అనుసంధానం చేసుకోండి**

దుబ్బాక: గృహజ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందేందుకు ప్రజలు తమ రేషన్ , ఆధార్ కార్డును మీటర్ సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని విద్యుత్ ఏఈ రామాంజనేయులు మంగళవారం తెలిపారు. కరెంట్ బిల్లులు ఇచ్చేందుకు వచ్చే తమ సిబ్బందికి రేషన్, ఆధార్ కార్డు వివరాలు తెలియజేస్తే విద్యుత్ సర్వీస్ నంబర్‌కు అనుసంధానం చేస్తారన్నారు.

◆ **అధికారులపై చర్యలు తీసుకోవాలి**

హుస్నాబాద్: ఉమ్మడి ఆస్తిని తన కోడలిపై మార్పిడి చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ మంగళవారం ఆర్డీఓ బెన్‌షాలోమ్‌కు వినతి పత్రం ఇచ్చింది. గాంధీనగర్ పంచాయతీ పరిధిలోని కిషన్ నగర్‌కు చెందిన చాతబోయిన మల్లమ్మ చిన్న కుమారుడి పేరిట ఉమ్మడి ఆస్తి ఉంది. అతడి మరణాంతరం చిన్న కోడలు తమకు తెలియకుండా గ్రామ పంచాయతీ రికార్డులో మార్పు చేయించిందని తెలిపింది. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

◆ **రాయితీని సద్వినియోగం చేసుకోండి**

హుస్నాబాద్: హుస్నాబాద్, చేర్యాల సర్కిల్ పరిధిలో ఈ–చలాన్ పెండింగ్ ఉన్న వాహనదారులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన భారీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ సతీష్ మంగళవారం తెలిపారు. వాహనదారులు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఫోన్ పే, గూగుల్ పే లేదా మీ సేవా కేంద్రంలో చెల్లించవచ్చన్నారు. ద్విచక్ర వాహనాలకు 80 శాతం, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, తోపుడు బండ్లపై 90 శాతం, నాలుగు చక్రాల వాహనాలు, లారీలు, భారీ వాహనాలకు 60 శాతం రాయితీ కల్పించిందని తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. ఫిబ్రవరి 15 తర్వాత స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానా మొత్తం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

◆ **నిధులు మంజూరు చేయిస్తా**

తొగుట(దుబ్బాక): తుక్కాపూర్ శ్రీపెద్దమ్మ దేవాలయ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. తుక్కాపూర్ ముదిరాజ్ సంఘం సభ్యులు మంగళవారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ప్రహరీ నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని వినతి పత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఆయన రూ.10 లక్షలు రెండు రోజుల్లో మంజూరు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో తుక్కాపూర్ మాజీ సర్పంచ్ విజయ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి పాల్గొన్నారు.

◆ **వైభవంగా చండీ హోమం**

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో కొలువైన స్వయం భూ శంభుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అత్యంత వైభవంగా పూజలు జరిగాయి. లక్ష్మీ గణపతి, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకాలు, హోమం, నవగ్రహ, రుద్ర, మన్యు పాశుపత హవనం, సుదర్శన హోమం, చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ **తహసీల్దార్‌కు వినతి**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం గ్రామ శివారులోని 321 సర్వే నంబర్‌లో ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని కోరుతూ మంగళవారం బెజ్జంకి తహసీల్దార్ శ్యామ్‌కు వినతి పత్రం అందజేశారు. నిరుపేదలకు పంపిణీ చేయగా మిగులు భూమిని అభివృద్ధి పనులకు కేటాయించాలని కోరారు.

◆ **బాధ్యతల స్వీకరణ**

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి ఎస్ఐగా రాజేశం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ–2గా పని చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పొద్దన్నారు. కాగా, ఇక్కడ పనిచేసిన నరేష్ మెదక్ జిల్లా పాపన్న పేట మండలానికి బదిలీపై వెళ్లారు.

◆ **జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక**

కొండపాక(గజ్వేల్): ఇంగ్లీష్ సబ్జెక్టుపై నిర్వహించిన స్పెల్ విజార్డ్ డ్రామా పోటీల్లో మండలంలోని దుద్దెడ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 13వ తేదీన సిద్దిపేటలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తారని హెచ్‌ఎం లక్ష్మి మంగళవారం తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించి జ్ఞాపికలు అందజేశారు.

◆ **వేలం పాటలు**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర పురస్కరించుకొని చేపట్టే పనులకు మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. పూజాసామగ్రి విక్రయానికి రూ.6.05 లక్షలు, కొబ్బరి కాయల విక్రయానికి రూ.2.04 లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.60,200లకు వ్యాపారులు ఏడాది కాలానికి హక్కులు దక్కించుకున్నారు. జాతరకు వచ్చే అతిథులకు కేటరింగ్ కోసం ప్లేట్‌కు రూ.129 మాధవ్ హక్కు పొందినట్లు ఈఓ కిషన్‌రావు తెలిపారు.

◆ **శ్రమించే తత్వాన్ని అలవర్చుకోవాలి**

సిద్దిపేటరూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే శ్రమించే తత్వాన్ని అలవరచుకోవాలని జక్కాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షౌకత్ అలీ అన్నారు. మంగళవారం జిల్లా స్థాయి గణిత, సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడు పాతూరి తిరుపతి రెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కొమ్మూరి పద్మ, లుక్క రాజును సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, మల్లారెడ్డి, గోపీనాథ్, సుభద్ర, కరుణ , శ్రీనివాస్ రెడ్డి, ప్రసన్న లక్ష్మి, దుర్గయ్య, అఖిల, నాజర్ పాల్గొన్నారు.

◆ **ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి**

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థినిని లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యానాథ్, ఏఐపీఎస్‌యూ జిల్లా నాయకుడు అప్పల కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం నంగునూరులో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. విద్యార్థినిని వేధించిన నంగునూరు ఉన్నత పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

◆ **ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య**

గజ్వేల్‌రూరల్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందని గజ్వేల్ ఏసీపీ రమేష్ అన్నారు. పట్టణంలోని 1వ వార్డులోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల అభివృద్ధి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు.